# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

–జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:– 9705770909 సంప్రదించండి.



సంచిక : 371 | సంపుటి : 2 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 2-3 -2025 | వెల : .రూ. 5.00




## టన్నెల్ దగ్గర కొనసాగుతున్న సహాయక చర్యలు

- ఘటనాస్థలికి చేరుకున్న ఉస్మానియా ఫోరెన్సిక్ వైద్యులు
- ఇదిలా ఉంటే టెన్నల్ దగ్గర ఇప్పటికే మృతుల బంధువులు, కుటుంబ సభ్యులు చేరుకున్నారు

మహబూబ్‌నగర్,
శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ టన్నెల్ దగ్గరకు ఉస్మానియా ఫోరెన్సిక్ వైద్యులు చేరుకున్నారు. ఫోరెన్సిక్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ శ్రీధర్ చారితో పాటు ఇద్దరు ఫ్యాకల్టీ, ఇద్దరు పీజీ వైద్యులు -మిగతా 2 లో



## మణిపూర్‌లో దారికొస్తున్న పరిస్థితులు

- 8 నుంచి రవాణాకు అనుమతులు
- ఉన్నతస్థాయిలో సమీక్షించిన హోంమంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ,
గత రెండేళ్లుగా జాతుల మధ్య వైరంతో అల్లకల్లోలంగా మారిన మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొనేలా కేంద్రం కృషి చేస్తోంది. ఇప్పుడు అక్కడ రాష్ట్రపతి పాలన కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్రంలోని భద్రతా పరిస్థితులపై ఉన్నత స్థాయి అధికారులతో -మిగతా 2 లో

## రేవంత్ రెడ్డివి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

- హామీలు అమలు చేయలేక తనపై విమర్శలు
- అబద్ధాలు ప్రచారం చేస్తే ప్రజలను నమ్మరు
- సీఎం రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి ఘాటు విమర్శలు



హైదరాబాద్,మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఇచ్చిన హామీలు అమలు చేయలేక చతికిల పడ్డ సిఎం రేవంత్ రెడ్డి తనపై పడి ఏడుస్తున్నాడని, వ్యక్తిగతంగా విమర్శలు చేస్తున్నారని, అబద్ధాలు చెప్పినంత మాత్రాన రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత తగ్గదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి -మిగతా 2 లో



## అజేయ శక్తిగా ఎదుగుతున్న భారత్

- కుంభమేళాతో నైపుణ్యాన్ని చాటాం
- ఎన్ఎక్స్‌టీ కాంక్లేవ్ 2025 లో ప్రధానమంత్రి మోడీ

న్యూఢిల్లీ,మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఇన్నేళ్లు శ్రామిక శక్తిగా పేరుపొందిన భారతదేశం ప్రస్తుతం ప్రపంచ శక్తిగా రూపొందుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇటీవల పెద్దఎత్తున మహాకుంభమేళా నిర్వహించి నిర్వహణా -మిగతా 2 లో



## మల్టీప్లెక్స్‌లకు ఊరట

- 16ఏళ్లలోపు పిల్లలకు అనుమతి..
- తదుపరి విచారణ 17కు విచారణ

హైదరాబాద్,
మల్టీప్లెక్స్‌లకు హైకోర్టులో ఊరట లభించింది. 16 సంవత్సరాలలోపు చిన్నారులను అన్ని షోలకు అనుమతించాలని ఆదేశించింది. జనవరి 21న ఇచ్చిన ఉత్తర్వులను న్యాయస్థానం సవరించింది. అయితే ప్రీమియర్, బెనిఫిట్ స్పెషల్ షోలకు మాత్రం పిల్లల అనుమతికి హైకోర్టు నిరాకరించింది. తదుపరి విచారణను ఈ నెల17కు హైకోర్టు ధర్మాసనం -మిగతా 2 లో

## బీజేపీ వర్సెస్ కాంగ్రెస్

- మామునూర్ ఎయిర్‌పోర్ట్ ఘనత మాదే
- కాంగ్రెస్, బీజేపీల పరస్పర ఘర్షణ

వరంగల్,
మామునూర్ ఎయిర్‌పోర్టు ప్రాంగణం దగ్గర తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. బీజేపీ వర్సెస్ కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. మామునూరు ఎయిర్ పోర్ట్‌కు ఆమోదం రావడంతో కాంగ్రెస్, బీజేపీ ఆధ్వర్యంలో వేరువేరుగా సంబరాలు చేసుకుంటున్నారు. ఒకే సమయంలో ఎయిర్ పోర్ట్ ప్రధాన గేటు వద్దకు కాంగ్రెస్, బీజేపీ నేతలు.. కార్యకర్తలు చేరుకున్నారు. -మిగతా 2 లో



## అక్రమ సరఫరా పై ఉక్కుపాదం



- ప్రభుత్వం చేపట్టే పనులకు అందుబాటులో ఇసుక
- మైనర్ ఖనిజాల వేలానికి వెంటనే టెండర్లను పిలవాలి‘
- ఇసుక స్టాక్ పాయింట్లు సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేయాలి
- అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్

హైదరాబాద్,మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఇసుక, ఖనిజాల అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం మోపాలని అధికారులను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టే పనులకు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ నుంచే ఇసుక సరఫరా చేయాలని స్పష్టం చేశారు. ఖనిజాభివృద్ధి శాఖపై నిర్వహించిన సమీక్షలో సీఎం మాట్లాడారు. ‘నిర్మాణరంగ సంస్థలకు అవసరమైన ఇసుకను ప్రభుత్వమే -మిగతా 3 లో



## త్వరలో ఉప ఎన్నికలు తప్పవు

- మంచి చెప్పడానికి రేవంత్ చేసిందేమీ లేదు
- తెలంగాణ భవన్‌లో కేటీఆర్ వ్యాఖ్యలు

హైదరాబాద్,మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
త్వరలో ఉప ఎన్నికలు వస్తాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోమారు అన్నారు.కాంగ్రెస్ మీటింగ్ లో మూడు ఆణిముత్యాల మాటలు చెప్పారు.. మంచి మైక్‌లో చెప్పాలి చెడు చెవిలో చెప్పాలి అన్నారు.. మంచి చెప్పడానికి నువ్వు చేసిన ఒక్క మంచి పని లేదని కేటీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి చేసిన చెడు చెబితే.. చెవిలో రక్తాలు -మిగతా 2 లో

## కాంగ్రెస్ పార్టీ నుంచి తీన్మార్ మల్లన్న సస్పెండ్

- ఆదేశాలు జారీ చేసిన కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి



హైదరాబాద్,మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
కాంగ్రెస్ పార్టీ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినందుకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేశారు. ఈమేరకు ఆ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా ప్రవర్తించడమే కాకుండా బీసీ కులగణన ప్రతులు చించడంపై ఆ పార్టీ అధిష్టానం సీరియస్ అయింది. దీనిపై వివరణ ఇవ్వాలంటూ -మిగతా 2 లో

# అక్రమ సరఫరా పై ఉక్కుపాదం

(మొదటి తరువాయి)

సరఫరా చేయాలి. సరైన ధరలకు సరఫరా చేస్తే అక్రమాలకు ఆస్కారం ఉండదు. హైదరాబాద్ నగరానికి మూడు వైపులా స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయాలి. క్వారీలకు జరిమానాలపై విధానపరమైన నిర్ణయం తీసుకోవాలి. మైనర్ ఖనిజాల వేలానికి వెంటనే టెండర్లు పిలవాలి‘ అని సీఎం ఆదేశించారు. ఇసుకతో పాటు ఇతర ఖనిజాల అక్రమ తవ్వకాలు, అక్రమ సరఫరాపై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కఠిన చర్యలతోనే అక్రమాలను అడ్డుకోగలమని, ప్రభుత్వానికి ఆదాయం పెంచగలమన్నారు. తొలుత గత నెల రోజులుగా తీసుకున్న చర్యలతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడిన విధానాన్ని, పెరిగిన ఆదాయాన్ని అధికారులు సీఎంకు వివరించారు. ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలు, రవాణా, వినియోగదారులకు తక్కువ ధరకు ఇసుక సరఫరాపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారు. ప్రభుత్వంలోని నీటి పారుదల, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్‌తో పాటు వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే పనులకు టీజీఎండీసీ నుంచే ఇసుక సరఫరా చేసేలా చూడాలన్నారు. పెద్ద మొత్తంలో నిర్మాణాలు చేపట్టే నిర్మాణ రంగ సంస్థలకు అవసరమైన ఇసుకను టీజీ ఎండీసీ ద్వారానే సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు. సరైన ధరలకు ప్రభుత్వమే ఇసుక సరఫరా చేస్తే అక్రమంగా సరఫరా చేసే వారిపై వినియోగదారులు ఆధారపడరన్నారు. హైదరాబాద్ నగరంతో పాటు సమీప ప్రాంతాల్లోనే ఇసుక ఎక్కువగా వినియోగం జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తక్కువ మొత్తంలో ఇసుక అవసరమైన వారు కొనుగోలు చేసేలా నగరానికి మూడు వైపులా ఇసుక స్టాక్ పాయింట్లు సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. గనుల శాఖ పరిధిలోని వివిధ ఖనిజాల క్వారీలకు గతంలో విధించిన జరిమానాలు, వాటి వసూళ్లపైనా సీఎం అధికారులను ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన విధానపరమైన నిర్ణయం త్వరగా తీసుకొని సమస్యను పరిష్కరించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మైనర్ ఖనిజాల బ్లాక్‌ల వేలానికి వెంటనే టెండర్లు పిలవాలని సీఎం ఆదేశించారు.

# బీజేపీ వర్సెస్ కాంగ్రెస్

(మొదటి తరువాయి)

ఈ క్రమంలో ఇరు వర్గాలు భారీగా వచ్చారు. దీంతో.. ఇరు పార్టీల నేతలు ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. కాగా.. కార్యకర్తలు, నాయకుల మధ్య తోపులాట, ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనపై సమాచారం తెలుసుకున్న పోలీసులు.. అక్కడికి చేరుకుని శాంతింప చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మరోవైపు.. బీజేపీ నేతలు ప్రధాని మోడీకి పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. అటు.. సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి అదే చోట పాలాభిషేకం చేసేందుకు కాంగ్రెస్ నేతలు యత్నించారు. దీంతో.. రెండు వర్గాల మధ్య వాగ్వాదం తోపులాట జరిగింది. కాగా.. మామునూరులో కొత్త విమానాశ్రయం నిర్మాణానికి కీలక ముందడుగు పడిన సంగతి తెలిసిందే.. ఎయిర్‌పోర్ట్ అభివృద్ధిపై గత కొంతకాలంగా కొనసాగుతున్న కసరత్తులకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మామునూరును విమానాశ్రయంగా అభివృద్ధి చేయాలని గతంలోనే ప్రతిపాదనలు పంపగా, తాజాగా కేంద్రం దీనికి అంగీకారం తెలిపింది. ఈ నిర్ణయంతో వరంగల్ ప్రాంతానికి ప్రయాణ సౌకర్యాలు మరింత పెరగనున్నాయి. విమాన ప్రయాణాల విస్తరణ, వ్యాపారం, పర్యాటకం అభివృద్ధికి మామునూరు ఎయిర్‌పోర్ట్ కీలకంగా మారనుంది. కేంద్రం అనుమతినిచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని పనులను వేగంగా ప్రారంభించనున్నట్లు సమాచారం.

# కాంగ్రెస్ పార్టీ నుంచి తీన్మార్ మల్లన్న సస్పెండ్

(మొదటి తరువాయి)

మల్లన్నకు ఫిబ్రవరి 5న షోకాజ్ నోటీస్ జారీ చేశారు. 12వ తేదీలోపు వివరణ ఇవ్వాలని కోరినా.. మల్లన్న నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. పార్టీ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిచినందుకు మల్లన్నను సస్పెండ్ చేస్తున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ మాట్లాడుతూ పార్టీ లైన్ దాటితే ఊరుకునేది లేదన్నారు. మల్లన్నను ఎన్నో సార్లు హెచ్చరించినా మార్పు రాలేదన్నారు. బీసీ కులగణన ప్రతులు చించడంపై ఏఐసీసీ సీరియస్ అయిందన్నారు. మల్లన్న చేసిన వాఖ్యలు చాల తప్పు అని ఆయన పేర్కొన్నారు.

**ఏఐసీసీ నిర్ణయం మేరకే తీన్మార్ మల్లన్న సస్పెండ్ :** టీ పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సస్పెన్షన్‌పై టీ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. తీన్మార్ మల్లన్న విషయంలో ఏఐసీసీ నిర్ణయం తీసుకుందన్నారు. రాహుల్ గాంధీ ఆదేశాలతోనే తీన్మార్ మల్లన్నను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా వ్యవహరించేవారికి ఇది ఒక హెచ్చరిక అని ఆయన తెలిపారు. భవిష్యత్‌లో ఎవరైనా పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవని మహేశ్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై ఆ పార్టీ వేటు వేసిన సంగతి తెలిసిందే. తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. ఫిబ్రవరి 5న తీన్మార్ మల్లన్నకు కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ వ్యతిరేక చర్యలపై మల్లన్నను కమిటీ వివరణ కోరింది. ఫిబ్రవరి 12వ తేదీలోపు వివరణ ఇవ్వాలని మల్లన్నకు కమిటీ గడువు ఇచ్చింది. వివరణ ఇవ్వకపోవడంతో తీన్మార్ మల్లన్నపై కాంగ్రెస్ పార్టీ వేటు వేసింది.

# టన్నెల్ దగ్గర కొనసాగుతున్న సహాయక చర్యలు

(మొదటి తరువాయి)

సంఘటనాస్థలికి చేరుకున్నారు. ఇదిలా ఉంటే టెన్నల్ దగ్గర ఇప్పటికే మృతుల బంధువులు, కుటుంబ సభ్యులు చేరుకున్నారు. మృతదేహాలను గుర్తించి అధికారులు బంధువులకు అప్పగించనున్నారు. మరోవైపు ప్రమాద స్థలం వరకు లోకో ట్రాక్‌ను జైపీ కంపెనీ సిద్ధం చేస్తోంది. ప్రమాదం జరిగిన స్థలంలో 200 మీటర్ల పొడవు, 9.2 మీటర్ల ఎత్తులో బురద, మట్టి, రాళ్లు ఉన్నాయి. ఇక్కడే టీబీఎం సగ భాగం కూరుకుపోయింది. మట్టిని బయటకు తరలించేందుకు మ్యానువల్‌గా సాధ్యం కాకపోవడంతో లోకోను అక్కడి వరకు తెచ్చే ప్రయత్నం చేస్తు?న్నారు. కన్వేయర్ బెల్టు కూడా అందుబాటులోకి వచ్చింది. 12వ కిలోమీటర్ నుంచి 13.5 కిలోమీటర్ల వరకు పేరుకుపోయిన మీటరున్నర మట్టిని రెస్క్యూ టీమ్స్ ఎత్తి పోస్తున్నాయి. లోకోను 13.5 కిలోమీటరు వరకు తీసుకొచ్చి మట్టిని బయటకు తరలించే ప్రయత్నం చేస్తున్నారు. కొన్నిరోజుల క్రితం ఈ టన్నెల్లో నిర్మాణ పనులు జరుగుతుండగా అనుకోని ప్రమాదం చోటుచేసుకుంది. 8 మంది లోపల చిక్కుకుపోయారు. ఈ సంఘటన ఎనిమిదో రోజుకు చేరుకుంది. కానీ ఇంకా పూర్తి స్థాయిలో రెస్క్యూ పూర్తవ్వలేదు. పనులు పూర్తి చేసేందుకు రెస్క్యూ బృందాలు నిరంతరం శ్రమిస్తున్నాయి. ప్రస్తుతం మట్టి తొలగింపు పక్రియ తుదిదశకు చేరుకుంది.


# మణిపూర్‌లో దారికొస్తున్న పరిస్థితులు

(మొదటి తరువాయి)

సమీక్ష నిర్వహించి..కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా మార్చి 8నుంచి రాష్ట్రంలోని అన్ని మార్గాల్లో ప్రజల రాకపోకలు స్వేచ్ఛాయుతంగా సాగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అడ్డంకులు సృష్టించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. హింసతో రగిలిపోతున్న ఈశాన్య రాష్ట్రంలో సాధారణ స్థితిని పునరుద్ధరించడంపై అమిత్ షా అధికారులతో చర్చలు జరిపినట్లు సమాచారం. దిల్లీలో నిర్వహించిన ఈ సమావేశంలో మణిపుర్ గవర్నర్ అజయ్ కుమార్ భల్లా, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఆర్మీ, పారామిలటరీ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించిన తర్వాత అక్కడి పరిస్థితులపై సమీక్ష సమావేశం నిర్వహించడం ఇదే మొదటిసారి. దాదాపు రెండేళ్లుగా జాతుల మధ్య వైరంతో రగులుతున్న మణిపుర్‌లో కల్లోల పరిస్థితుల నేపథ్యంలో ఇటీవల సీఎం బీరెన్ సింగ్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో అక్కడ రాష్ట్రపతి పాలన విధించిన కేంద్ర ప్రభుత్వం అధికారాలన్నింటినీ అక్కడి గవర్నర్‌కు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో తమ వద్ద ఉన్న అక్రమ ఆయుధాలు, పేలుడు పదార్థాలను ఏడు రోజుల్లోగా అప్పగించాలని రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు గవర్నర్ అజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఏడు రోజులలో దాదాపు 300 ఆయుధాలను ప్రజలు ప్రభుత్వానికి అప్పగించినట్లు సమాచారం.

# రేంవత్ రెడ్డివి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

(మొదటి తరువాయి)



కిషన్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత వారం రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి బీజేపీపై.. వ్యక్తిగతంగా తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వాస్తవాలకు విరుద్ధంగా బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారు.. అవగాహన, అనుభవ రాహిత్యంతో, అసహంతో మాట్లాడుతు న్నారని ఆరోపించారు. తాను కేంద్ర మంత్రిగా చేసిన పనులు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియ చేస్తున్నానని.. కేంద్ర పథకాల్ని తెలంగాణలో అమలు చేస్తున్నామని తెలిపారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ‘రాష్ట్రాలకు కేంద్రం నిధులు ఇవ్వడంలో ఒక విధానం ఉంటుంది. తెలంగాణలో కేంద్రం చేపట్టిన రూ.10లక్షల కోట్ల విలువైన పనులను ఇప్పటికే వివరించాం. నేను ఇతర కేంద్ర మంత్రులను బెదిరించానని దిగజారుడు మాటలు మాట్లాడారు. కేంద్ర పథకాలను సమర్థంగా అమలు చేయాలని సీఎంలకు ఎన్నో లేఖలు రాశాను. సీఎంలతో సంబంధం లేకుండా రాష్ట్ర అభివృద్ధిని కోరుకునే వ్యక్తిని. దేశంలో నిర్మించే 7 టెక్స్‌టైల్ పార్కుల్లో ఒకటి తెలంగాణకు తెచ్చాను. రాష్ట్రానికి ఆర్‌ఆర్‌ఆర్‌ను కేంద్రం మంజూరు చేసింది. ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంది. వాటిని పక్కన పెట్టి భాజపాపై ఆరోపణలు చేస్తున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారం లేక పోవడంతో కొన్ని అమలు చేయలేక పోయామని పేర్కొన్నారు. 14 నెలల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేక తన మీద దాడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు, ఆయన పైన అసంతృప్తి.. ఆయన మాటల్లో స్పష్టంగా కనిపిస్తుందని కిషన్ రెడ్డి తెలిపారు. బీజేపీని బ్లాక్ మెయిల్ చేసినంత మాత్రాన రేవంత్ రెడ్డి మీద వ్యతిరేకత పోదని కిషన్ రెడ్డి ఆరోపించారు. రేవంత్ రెడ్డి మాట తెలంగాణ ప్రజకు నమ్మే పరిస్థితి లేదు.. తాను అంకిత భావంతో పని చేస్తున్నానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారం కోసం కేసీఆర్‌కు 40 ఉత్తరాలు రాశానని.. రేవంత్ రెడ్డికి కూడా ఉత్తరాలు రాశానని అన్నారు. తెలంగాణ రేవంత్ రెడ్డి సొంత జాగీరా.. రేవంత్ రెడ్డి మీద కోపంతో తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటామా.. అని అన్నారు. విలువలకు కట్టుబడి పని చేస్తానని.. చిన్నప్పటి నుండి సిద్ధాంతం కోసం పని చేశా.. నీ తాటాకు చప్పుళ్ళకు భయపడనని రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సూచించారు. ఇచ్చిన హామీలు అమలు చేయక తమ మీద దాడి చేస్తున్నారని మండిపడ్డారు.

# అజేయ శక్తిగా ఎదుగుతున్న భారత్

(మొదటి తరువాయి)

నైపుణ్యాన్ని చాటుకుందని, రోజుకో రికార్డును భారతదేశం సృష్టిస్తోందని చెప్పారు. భారతదేశ నిర్వహణా నైపుణ్యం, ఆవిష్కరణల సామర్థ్యాన్ని ప్రపంచం మొత్తం ఆసక్తిగా గమనిస్తోందని అన్నారు. దేశ రాజధానిలో శనివారంనాడు నిర్వహించిన ఎన్‌ఎక్స్‌టీ కాంక్లేవ్ 2025 లో ప్రధానమంత్రి మాట్లాడుతూ, భారత్ గురించి ప్రతిరోజూ సానుకూల సమాచారం వస్తుండటంతో ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనిస్తూ, భారత్‌కు రావాలని తహతహలాడుతున్నాయని చెప్పారు. ఫిబ్రవరి 26వ తేదీతో ప్రయాగ్‌రాజ్‌లో ముగిసిన మహాకుంభ్-2025 గురించి మోదీ ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, ఒక టెంపరరీ సిటీలో నదీతీరాల వెంబడి కోట్లాది మంది ప్రజలు పవిత్రస్నానాలు చేయడంపై యావత్ ప్రపంచం ఆశ్చర్యంతో చూసిందని,మహాకుంభ మేళా నిర్వహణ భారతదేశం పాటించే నిర్వహణా నైపుణ్యాలు, ఆవిష్కరణలను ప్రపంచానికి చాటిచెప్పిందని అన్నారు. భారతదేశం గ్లోబల్ శక్తిగా ఎదుగుతున్న వైనాన్ని మోదీ వివరిస్తూ, ఏఐ సదస్సులో భారతదేశం కో-హోస్ట్‌గా వ్యవహరించిందని, భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో భారత్ కీలక భూమిక పోషించనుందని చెప్పారు. తదుపరి ఏఐ సమ్మిట్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుందని చెప్పారు. ఏఐ, గ్లోబల్ ఎకనామిక్ సమ్మిట్ల ద్వారా టెక్నాలజీ, ఇన్నొవేషన్, గ్లోబల్ డిఎ÷-లొమసీలో ఎదుగుతున్న శక్తిగా భారత్ కీలక పాత్ర పోషించనుందని స్పష్టం చేశారు. ÷ారతదేశం సెమికండక్టర్లు, విమాన వాహక నౌకల తయారీ వంటి వాటితో వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఆటోమొబైల్ ఉత్పత్తిదారుగా కూడా మరిందని వివరించారు. భారత దేశం పాటించే యోగా, ధ్యానం వంటివి విదేశీయులు ఆచరిస్తున్నారని, మన సూపర్‌ఫుడ్ మఖానా, మి÷-లలెట్, ఆయుష్ ఉత్పత్తులు విరివిగా వాడుతున్నారని మోదీ చెప్పారు.

# మల్టీప్లెక్స్‌లకు ఊరట

(మొదటి తరువాయి)

వాయిదా వేసింది. కాగా.. జనవరి 21న 16 ఏళ్ల లోపు పిల్లలు మల్టీప్లెక్స్ థియేటర్‌కు వెళ్లే విషయంపై న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. సమయాబావం లేకపోవడంతో పిల్లలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారించిన హైకోర్టు పలు కీలక ఉత్తర్వులు ఇచ్చింది. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు 16 సంవత్సరాల లోపు చిన్నారులు వెళ్లకూడదు అని ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై అన్ని వర్గాల అభిప్రాయాలను సేకరించాలని హైకోర్టు ధర్మాసనం కోరింది. అయితే హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై మల్టీప్లెక్స్ యాజమాన్యం పోరాడుతోంది. బెనిఫిట్ షో, స్పెషల్ షోలకు అనుమతులు ఇవ్వకపోయినప్పటికీ తాజాగా 16 ఏళ్లలోపు చిన్నారులను అనుమతించే విషయంలో ఉత్తర్వులను హైకోర్టు సవరణ చేసింది. 16 ఏళ్ల చిన్నారులు థియేటర్‌లోకి వెళ్లే విషయంలో నిబంధనలు విధిస్తే.. సినిమా వసూళ్లపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ఫ్యామిలీ ఆడియన్స్ సినిమాకు వెళ్లే సమయంలో కుటుంబం మొత్తం వెళ్తుంటారు. ఈ క్రమంలో నిబంధనలు ఉంటే ఫ్యామిలీ వెళ్లే అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో ఇతర వర్గాల అభిప్రాయాల సే కరించి కోర్టుకు సమర్పించడంతో న్యాయస్థానం జనవరి 21న ఇచ్చిన ఉత్తర్వులను సవరించింది. అలాగే స్పెషల్ షోలు, బెనిఫిట్ షోలకు ఎట్టిపరిస్థితిల్లో పర్మిషన్ ఇవ్వబోమని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే తేల్చిచెప్పిన విషయం తెలిసిందే. ఇదే అంశాన్ని కూడా హైకోర్టు ప్రస్తావిస్తూ తదుపరి విచారణను ఈనెల 17కు వాయిదా వేసింది.

# త్వరలో ఉపఎన్నికలు తప్పవు



(మొదటి తరువాయి)

కారుతాయని అన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో పలువురు కార్యకర్తలు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. కార్తీక్ రెడ్డి అసెంబ్లీకి ఎమ్మెల్యేగా వస్తారని తెలిపారు. కేసీఆర్ దళం గులాబీ వనంలోకి వస్తున్న అందరికీ స్వాగతం అని పేర్కొన్నారు. కొత్తగా వచ్చిన ఇంచార్జి మీనాక్షి తన బ్యాగ్ మోయొద్దు అని చెప్పింది.. నీ పక్కన కూర్చున్న రేవంత్ రెడ్డినే బ్యాగ్‌లు మోసి పైకి వచ్చాడని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎక్కడ చూసినా రేవంత్ రెడ్డిని బండ బూతులు తిడుతున్నారు.. రైతు బంధు ఎవరికీ పడడం లేదు అని తిడుతున్నారని అన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు టింగ్ టింగ్ మని పడేవి అని చెబుతున్నారు.. అందుకే రేవంత్ రెడ్డికి టింగ్ టింగ్ అనే పదం పడదని విమర్శించారు. అందుకే టకీ టకీ మని రైతు భరోసా పడుతుంది అంటున్నాడు.. ఎక్కడ చూసినా రైతు భరోసా పడట్లేదని కేటీఆర్ పేర్కొన్నారు. ఫాం హౌస్‌లు ఎవరికీ లేవు లోకం మీద.. నాకు ఒక్కడికే ఉన్నట్లు చెబుతున్నారు.. జెన్వాడలో ఉన్న తన కోసమే హైడ్రా ఏర్పాటు చేశారని కేటీఆర్ ఆరోపించారు. మరోవైపు.. ఎస్ఎల్‌బీసీ ప్రమాదానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమేనని కేటీఆర్ మండిపడ్డారు. వేగంగా కమీషన్ల కోసం పనులు స్టార్ట్ చేశారు.. ఎస్ఎల్‌బీసీ వద్ద ఒక మంత్రి చేపలు తిందాం అంటాడు.. ఇంకో మంత్రి నీళ్లు వాటర్ కలవడం వల్ల జరిగింది అంటున్నాడు.. ఇలాంటి మంత్రులు ఉన్నారని దుయ్యబట్టారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాదానికి కారణం కేసీఆర్ అని అంటున్నారు.. అధికారం కోల్పోయి ఇన్ని నెలలు అయినా కేసీఆర్ అనే అంటున్నారని పేర్కొన్నారు. వచ్చే పంచాయతీ ఎన్నికలు అయినా.. పార్లమెంట్ ఎన్నికలు అయినా గులాబీ జెండానే ఎగురుతుందని తెలిపారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ వాళ్లు వచ్చి మాయమాటలు చెబుతారు.. ఇంకోసారి అసలు మోసపోవద్దని కేటీఆర్ పేర్కొన్నారు.

## తెలుగు పంచాంగం 2/3/2025,ఆదివారం



**సమయ సమాచారం:**
సూర్యోదయం: ఉదయం 6:37
సూర్యాస్తమయం: సాయంత్రం 6:19
**తిథి:**
శుక్ల పక్ష తృతీయ: మార్చి 2, 12:09 AM నుండి మార్చి 2, 9:02 PM వరకు
చతుర్థి: మార్చి 2, 9:02 PM నుండి మార్చి 3, 6:02 PM వరకు
**నక్షత్రం:**
ఉత్తరాభాద్ర: మార్చి 1, 11:22 AM నుండి మార్చి 2, 8:59 AM వరకు
రేవతి: మార్చి 2, 8:59 AM నుండి మార్చి 3, 6:39 AM వరకు
**అశుభ సమయాలు:**
రాహుకాలం: సాయంత్రం 4:51 నుండి 6:19 వరకు
యమగండం: మధ్యాహ్నం 12:28 నుండి 1:56 వరకు
దుర్ముహూర్తం: సాయంత్రం 4:45 నుండి 5:32 వరకు
వర్జ్యం: సాయంత్రం 7:49 నుండి 9:15 వరకు
**శుభ సమయాలు:**
అమృతకాలం: ఉదయం 4:29 నుండి 5:55 వరకు
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 12:04 నుండి 12:51 వరకు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 5:00 నుండి 5:48 వరకు

# పుణ్యక్షేత్రాల సందర్శన యాత్ర విజయవంతం

**-ప్రయాగ్ రాజ్, అయోధ్య, కాశి, గయా, బుద్ధగయా తదితర పుణ్యక్షేత్రాలు సందర్శన**



**-షాద్ నగర్ పట్టణానికి చెందిన పలువురు ఆర్యవైశ్య సోదరుల యాత్ర**

**షాద్ నగర్, మార్చ్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణానికి చెందిన పలువురు ఆర్యవైశ్య సోదరులు పుణ్యక్షేత్రాల సందర్శన యాత్ర విజయవంతంగా ముగించుకుని తిరిగి షాద్ నగర్ చేరుకున్నారు. ప్రయాగ్ రాజ్, అయోధ్య, కాశి, గయా, బుద్ధగయా తదితర పుణ్యక్షేత్రాలు సందర్శించి ప్రత్యేక పూజలు, మహా కుంభమేళ నది స్నానాలను ఆచరించారు. ఐదు రోజులపాటు సాగిన ఈ తీర్థయాత్రలు శనివారంతో ముగిసి పట్టణానికి చేరుకున్నారు. యాత్రలో పాల్గొన్న వారిలో ప్రముఖ వ్యాపారస్తులు దండు వాసు దంపతులు, పలమట్ల శివకుమార్, నాగిళ్ల భవాని ప్రసాద్, రాచమల్ల సురేష్, డాక్టర్ జి సురేష్, తాటిశెట్టి నవీన్, పసుపుల రాజేందర్, ఎలుకుర్తి శ్రీనివాస్, తాటి శ్రీధర్, పాలాది బుచ్చి రాములు, ధర్మపురం రామకృష్ణ, గుబ్బ స్వామి తదితర దంపతులు మొత్తం 42 మంది కుటుంబ సభ్యులతో ఈ యాత్రలో పాల్గొన్నారు..

# వీరభద్ర స్వామి అనుగ్రహం కోసం ప్రత్యేక పూజలు

**– రవీంద్ర కుమార్**



**దేవరకొండ, మార్చ్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు మరియు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ శనివారం కమలాపురం వీరభద్ర స్వామి జాతర సందర్భంగా వీరభద్ర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర కుమార్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని, దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు రవీంద్ర కుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు టీవిఎన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుభాష్, బొడ్డు గోపాల్ గౌడ్, బాదేపల్లి పులిరాజ్, గుండాల వెంకట్ యాదవ్, మాజీ సర్పంచ్ దస్రు, కడారి మల్లేష్ యాదవ్, గుంటోజు రాజు, తొనగర్ ప్రతప్, గొట్టిముక్కల శివ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాదిగ అమరవీరుల సంస్కరణ దినోత్సవం




**దేవరకొండ, మార్చ్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దేవరకొండ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో, బస్టాండ్ దగ్గర డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, మాదిగ అమరవీరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా వారికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ పి, నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మారుపాక గోపాల్, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎం ఎస్ ఎఫ్) దేవరకొండ నియోజకవర్గ ఇంచార్జ్ నల్ల శ్రీకాంత్ జాంభవ్ పాల్గొన్నారు. మారుపాక గోపాల్, నల్ల శ్రీకాంత్ జాంభవ్ మాట్లాడుతూ, ఏబిసిడి వర్గీకరణ కోసం ఉద్యమాల్లో అమరులైన మాదిగ అమరవీరుల త్యాగాలను ఎస్సీ ఉపకులాలు ఎన్నటికీ మరవలేనివని, ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ శాస్త్రీయ పద్ధతులు లేనందున ఉపకులాల అందరికీ వెనుకబాటుతనంగా, లేక జనాభా ప్రతిపాదికగా న్యాయబద్ధంగా వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అమరులైన కుటుంబాలకి రాష్ట్ర ప్రభుత్వం ఇంటికొక ఉద్యోగం, 200 గజాల ఇంటి స్థలం ఇప్పించి వారి ఆదుకోవాలని కూడా కోరారు. ఈ కార్యక్రమంలో కొండ్రపల్లి రమేష్, ఎం ఎస్ ఎఫ్ దేవరకొండ మండల అధ్యక్షులు రోహిత్, గణేష్, శివకుమార్, రాజేష్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓంకార్ స్కూల్ లో సైన్స్ ఫేర్ కార్యక్రమం

**ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మరియు మండల విద్యాధికారి ఆమ్ఈఓ మనోహర్**



**షాద్ నగర్, మార్చ్ 1(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా, షాద్ నగర్ పట్టణలోని ఓంకార్ స్కూల్ లో సైన్స్ ఫేర్ సందర్భంగా సాహిత్య విద్యాలయ నిర్వహించిన సైన్స్ ఫేర్ కు హాజరైన ప్రముఖులు షాద్ నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ మరియు మండల విద్యాధికారి ఆమ్ఈఓ మనోహర్ ప్రాజెక్ట్స్ అన్ని చూసి, విద్యార్థులను అభినందించారు. అంతేకాకుండా విద్యార్థులలో ఉన్న ప్రతిభను గుర్తించి వారితో ఉత్తమమైన ప్రదర్శన చేయించిన ఉపాధ్యాయ బృందానికి మరియు పాఠశాల యాజమాన్యమైన కరస్పాండెంట్ యం.కే రాజన్ ప్రిన్సిపల్ అజిత రాజన్ ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.


# విద్యార్ధి ఉమేష్ వ్యవహారంలో అధికారుల పై చర్యలకు బిజెపి డిమాండ్



**వెల్దండ, మార్చ్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహా శివరాత్రి రోజున గుండాల కోనేరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి ఉమేష్ మరణించిన సంఘటనలో గుడి యాజమాన్యం నిర్లక్ష్యం కారణం అని వెల్దండ మండల బిజెపి పార్టీ పేర్కొంది. విద్యార్థి మరణానికి ప్రధాన కారణమైన ఆలయ కమిటీ మరియు సంబంధిత అధికారులను %జూ% ను వెంటనే సస్పెండ్ చేయాలని బిజెపి మండల అధ్యక్షులు కురుమిద్దె యాదగిరి డిమాండ్ చేశారు. విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం తరఫున దేవాలయం తరఫున ఎక్స్గ్రేషియా 50 లక్షలు ఇవ్వాలని కూడా డిమాండ్ చేశారు. సింగల్ విండో వైస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, గుద్దటి రామస్వామి, శ్రీశైలం విష్ణు గౌడ్, పాండు వెంకటేష్, యాదగిరి, లక్ష్మయ్య, శ్రీశైలం, ఉడుత గణేష్ తదితరులు ఈ డిమాండ్ ను మద్దతు ఇచ్చారు

## రంజాన్ నెల ప్రారంభోత్సవ శుభాకాంక్షలు తెలిపిన జూపల్లి భాస్కరరావు

**చారకొండ, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చారకొండ మండల పరిధిలోని జూపల్లి గ్రామంలో కల్వకుర్తి నియోజకవర్గ ముస్లిం సోదరులు నెల రోజులపాటు ఉపవాస దీక్షలు ప్రారంభించారు. కురాన్ పఠనం లో గడిపే ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ నెల ప్రారంభోత్సవ శుభాకాంక్షలు తెలిపిన వెల్దండ సింగల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కరరావు. ఈ సందర్భంగా, జూపల్లి భాస్కరరావు మాట్లాడుతూ, "రంజాన్ నెల ప్రారంభం సందర్భంగా ముస్లిం సోదరుల మరియు సోదరీమణులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఈ పవిత్ర నెలలో ఉపవాస దీక్షలు, కురాన్ పఠనం మరియు ప్రార్థనలతో మనసు ప్రశాంతంగా ఉండాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు.



## జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ కు ఆహ్వానం

**– యువ ఉత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ**




**కల్వకుర్తి, మార్చ్ 1(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జాతీయ యువజన,క్రీడా సర్వీసులు శాఖ నాగర్ కర్నూల్ జిల్లా మై భారత్,కల్వకుర్తి స్వామివివేకానంద సేవ బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "యువ ఉత్సవ్" కార్యక్రమానికి జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ కు ముఖ్య అతిథులుగా పాల్గొనాలని ఆహ్వానం అందజేశారు. జిల్లాలో ఉన్న యువత లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ కార్యక్రమంలో భాగంగా చిత్రలేఖనం,కవిత్వం ,ఫోటోగ్రఫీ,నృత్యం,సంగీతం,ఉపన్యాస పోటీలు నిర్వహించి వారిని జాతీయ స్థాయిలో నిలబెట్టడానికి యువ ఉత్సవ్ ఒక వేదిక అని హుస్సేన్ నాయక్ గారికి వివరించారు.అనంతరం యువ ఉత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు . కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా యువజన అధికారి కోటా నాయక్ , స్వామివివేకానంద సేవా బృందం ఆధ్యక్షుడు శివ కుమార్ ,సభ్యులు అనిల్ తదితరులు పాల్గొన్నారు.


# సిక్కింలో లయన్స్ క్లబ్ జోన్ సోషల్ సమావేశం



**ఆమనగల్, మార్చ్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఈనెల 5న సిక్కిం రాష్ట్రం గాంగ్టాక్ లో లయన్స్ క్లబ్ జోన్ సోషల్ సమావేశం నిర్వహించబడనుందని లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ సంపతి జనార్ధన్ రెడ్డి తెలిపారు. జోన్ సోషల్ సమావేశంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, లయన్స్ క్లబ్ ఆఫ్ కందుకూరు, లయన్స్ క్లబ్ ఆఫ్ బాలాజీ నగర్, మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ కల్వకుర్తి క్లబ్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు పాల్గొననున్నారు. 2024 - 2025 సంవత్సరంలో చేపట్టే సేవా కార్యక్రమాలు ఈ సమావేశంలో చర్చించబడతాయని సంపతి జనార్ధన్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎల్సిఐఎఫ్ కోఆర్డినేటర్ జి. చెన్న కిషన్ రెడ్డి, రామ్ రెడ్డి లయన్ ఐ ఆసుపత్రి చైర్మన్ లయన్ డాక్టర్ దామోదర్ రెడ్డి, లయన్ జూలూరి రమేష్ బాబు హాజరవుతారని పేర్కొన్నారు. క్లబ్ సభ్యులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సంపతి జనార్దన్ రెడ్డిలు కోరారు.

## శక్తిపీఠం కామాఖ్య దేవాలయాన్ని సందర్శించిన ఆమనగల్లు మాజీ సర్పంచ్ దంపతులు

**ఆమనగల్లు, మార్చ్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో ఉన్న ప్రఖ్యాత శక్తిపీఠం కామాఖ్య దేవాలయాన్ని శనివారం ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కరుణశ్రీ మరియు కేశవులు దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా, గుర్రం కరుణశ్రీ మరియు కేశవులు దంపతులు కామాఖ్య దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పర్యటన ద్వారా వారు తమ ఆధ్యాత్మికతను దృఢంగా తెలిపి, దేవాలయ పరిసరాలను కూడా దర్శించారు.



## ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్తాం


**– ఎమ్మెల్యే శంకర్**



**షాద్ నగర్, మార్చి 1 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అభివృద్ధి అనేది ప్రజాస్వామ్య ప్రభుత్వంలో నిరంతర ప్రక్రియ అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని గత పది సంవత్సరాల కాలంలో అన్ని రకాలుగా చిన్నాభిన్నం చేశారని, అందుకే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారమిచ్చారని అన్నారు. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు, ఆరు గ్యారెంటీలలో నాలుగు హామీలను నెరవేర్చారని, రాష్ట్రంలో అభివృద్ధి బాటలో పయనిస్తున్నామని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం, సబ్సిడీ సిలిండర్లు, ఉచిత కరెంటు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతు భరోసా వంటి పథకాలు ప్రజలకు అందుతున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, అన్ని ప్రభుత్వాలు మారినా, సమస్యలు కొన్ని అలాగే ఉంటాయని తెలిపారు. మాకు పార్టీలతో సంబంధం లేదని, ప్రతి పేదవాడు మా వాడే అని, ప్రజలకు న్యాయం చేయవలసిన బాధ్యత మాపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, చెంది తిరుపతిరెడ్డి, నక్కల బాలరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నాయకుడు బుట్టి రాములు ఆకస్మిక మృతి

**-నివాళులర్పించిన జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి.**



**ఇబ్రహీపట్నం,మార్చి 01 (నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు , ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బుట్టి రాములు ముదిరాజ్ తీవ్రమైన గుండెపోటుతో మరణించారు. శనివారం తెల్లవారుజామున ఆయన తన నివాసంలో నిద్రిస్తుండగా తీవ్రమైన గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు.రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు , ఇబ్రహీపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి స్వగ్రామం ఎలిమినేడుకు చెందిన రాములు గ్రామ ఎంపిటిసిగా కూడా సేవలందించారు. ఆయన ఆకస్మిక మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. రాములు భార్య బుట్టి యాదమ్మ కూడా ఎలిమినేడు గ్రామ సర్పంచ్ గా భాద్యతలు నిర్వహించారు. సిపియం పార్టీలో అనేక సంవత్సరాలపాటు పనిచేసిన రాములు మంచిరెడ్డి కుటుంబంతో గల సాన్నిహిత్యంతో బిఆర్ఎస్ పార్టీలో చేరి క్రియాశీలకంగా పనిచేశారు. ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన కులపెద్దగా ఆయన సంఘం కార్యకలాపాలలో కూడా చురుకుగా పాల్గొనేవారు. రాములు ఆకస్మిక మరణంతో కలత చెందిన మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి వెంటనే గ్రామానికి చేరుకుని ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. సౌమ్యుడుగా ప్రజలలో పనిచేసిన రాములు మృతి పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి , జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డి , మాజీ ఎంపిపి కృపేష్ , వైస్ ఎంపిపి ప్రతాప్ రెడ్డి , సింగిల్ విండో చైర్మన్ మంచిరెడ్డి మహేందర్ రెడ్డి , మండల అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు , కార్యదర్శి భాస్కర్ రెడ్డి , డైరెక్టర్ తొట్ల యాదమ్మ , ముదిరాజ్ సంఘం నియోజక వర్గం అధ్యక్షులు గంట భిక్షపతి , చెనమోని లక్ష్మయ్య , మహేందర్ ముదిరాజ్ , నర్సింహ్మా ముదిరాజ్ , చంటి , బిఆర్ఎస్ నాయకులు రాజేందర్ రెడ్డి , మేడ్చల్ రాంరెడ్డి , నర్సింహ్మా , బుగ్గరాములు, మైసయ్య ,యాదగిరి, ధృవ , శేఖర్ గౌడ్ ,సిపియం జిల్లా కార్యదర్శి యాదయ్య ,నాయకులు సామేలు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# పాఠకులకు గమనిక:




మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.


**మమ్మల్ని సంప్రదించడానికి:**
**ఇమెయిల్:** neelagiriexpress@gmail.com
**సంప్రదింపు నెంబర్: 9705770909**

**మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.**

**మీ గొంతుకకు మేమే వేదిక - నీలగిరి ఎక్స్‌ప్రెస్!**

# అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా బందోబస్తు

**-జోగులాంబ జోన్-7డిఐజి చోహన్**



**వనపర్తి,మార్చి1 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వనపర్తిజిల్లా కేంద్రంలో నేడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా శనివారం జోగులాంబ జూన్-7 డిఐజి ఎల్ ఎస్, చౌహన్, జిల్లా ఎస్పీ శ్రీ రావుల గిరిధర్ తో కలిసి ముందస్తు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు . వనపర్తి జిల్లాలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందనివారు తెలిపారు. ముందుగా పాలిటెక్నిక్ కళాశాల హెలిప్యాడ్ నుండి జెడ్పిహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాల వరకు వరకు రూట్ బందోబస్తుని పరిశీలించారు. విఐపి కాన్వాయ్ వెళ్లే సమయంలో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రోడ్ ఓపెనింగ్ పార్టీ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. (బహిరంగ సభకు) పబ్లిక్ మీటింగ్ కు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పబ్లిక్ మీటింగ్ వచ్చే వారికీ వనపర్తి ఆర్టిసి బస్ డిపోలో పార్కింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని పబ్లిక్ మీటింగ్ కు వచ్చే వారు తమకు కేటాయించిన ప్రదేశాలలో మాత్రమే పార్కింగ్ చేయాలని తెలిపారు. ప్రజలు అత్యవసర సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే డయల్100 కి ఫోన్ చేసి పోలీసువారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో వారి వెంట వనపర్తి సీఐ కృష్ణ పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# దశదిన కర్మలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోగిరెడ్డి లచ్చిరెడ్డి



**మంచాల,మార్చి 01(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆరుట్ల గ్రామంలో బీజేపీ కార్యకర్తలు అయినా కొత్తపల్లి రవిగౌడ్, శేఖర్ గౌడ్ తండ్రి కీ.శే. కొత్తపల్లి పెద్దులు దశదిన కర్మలో పాల్గొని నివాళులర్పించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోగిరెడ్డి లచ్చిరెడ్డి , జిల్లా నాయకులు దన్నే భాషయ్య . ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిఏసీఎస్ డైరెక్టర్ జనార్ధన్ రెడ్డి, జిల్లా నాయకులు పాండాల. జంగయ్య గౌడ్, మంచాల మండల బిజెపి అధ్యక్షులు నూకం.రాజు ముదిరాజ్ . సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి , సుంకరి ప్రవీణ్ గౌడ్, కార్యకర్తలు బాలరాజ్ గౌడ్, వెంకట్ గౌడ్, గ్రామ కుల పెద్దలు యాదయ్య సార్,శ్రీనివాస్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు..



**హైదరాబాద్,మార్చి 01( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
రంగారెడ్డి జిల్లా అభివృద్ధి కోసం అవసరమైతే రాజీనామా చేస్తానని కాంగ్రెస్ సీనియర్ నేత, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు.
రాష్ట్ర జనాభాలో అధికంగా ఉన్న రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి ఉండాలని చెప్పారు. సామాజిక సమీకరణాలు అడ్డొస్తే తాను రాజీనామా చేసి.. ఎవరినైనా గెలిపిస్తానన్నారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం చేయొద్దని కోరారు. పార్టీలోకి ఎవరైనా వస్తే గౌరవం ఇవ్వాలని.. పదవులు కాదన్నారు. ఇటీవల పార్టీలోకి వచ్చినవారికి మంత్రి పదవులు ఇచ్చారన్నారు. కాంగ్రెస్ కోసం కష్టపడిన వారిని పక్కనపెట్టడం సరికాదని చెప్పారు.

# తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరిన పలువురు నాయకులు






**హైదరాబాద్, మార్చ్ 1(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరియు సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో, రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం శంకర్ పల్లి మాజీ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డితో సహా పలువురు సర్పంచులు, 500 మంది బీజేపీ మరియు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.
ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, "నిన్న రేవంత్ రెడ్డి నాయకత్వంలో గాంధీ భవన్‌లో కాంగ్రెస్ సమావేశం జరిగింది. ఢిల్లీ నుంచి వచ్చిన కొత్త ఇంచార్జ్‌కి స్వాగతం పలుకుతూ సమావేశం పెట్టారు. రేవంత్ రెడ్డి మూడు ఆణిముత్యాల్లాంటి మాటలు చెప్పాడు. 'మంచి మైకుల్లో చెప్పాలి, చెడు చెవుల్లో చెప్పాలి' అని చెప్పాడు. మంచి మైకుల్లో చెప్పుదామని అనుకుంటే, నువ్వు చేసిన మంచి పని ఏదీ లేదు. మైకుల్లో మంచి చెబుదామని అనుకునే సరికి కరెంట్ కట్ అయిపోయింది. చెడు చెవుల్లో చెప్పాలని మొదలు పెడితే, హైద్రాబాద్ నుంచి ప్రారంభించి ఆర్ఆర్ ట్యాక్స్, ఎస్ఎల్బీసీ టన్నెల్, పెద్దవాగు, మునిగిన వట్టెం పంప్ హౌజ్ గురించి చెబితే నీ చెవిలో రక్తం కారిపోతుంది రేవంత్ రెడ్డి... యాదిలో పెట్టుకో! రేవంత్ రెడ్డి చాలా తెలివిగా చెప్పానని డైలాగులు కొడుతున్నాడు," అని విమర్శించారు.
కొత్త ఇంచార్జి మీనాక్షి మాట్లాడుతూ, "రైల్వేస్టేషన్‌లో దిగగానే బ్యాగులు మోసేందుకు కొంతమంది కాంగ్రెస్ నేతలు ఉరికొచ్చారు. బ్యాగులు మోసి మీ ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయొద్దని చెప్పారు." కానీ మీ పక్కన కూర్చొన్న వ్యక్తి చంద్రబాబు బ్యాగులు మోసి, ఇప్పుడు ఢిల్లీకి బ్యాగులు మోస్తున్నాడు. ఆయన్ని పక్కన పెట్టుకుని బ్యాగులు మోయొద్దంటే ఆ మేడంకు ఏం చెప్పాలి. మీనాక్షి గారు వాస్తవాలు తెలుసుకోవాలని కోరుతున్నానని కేటీఆర్ పేర్కొన్నారు.
కేటీఆర్ రేవంత్ రెడ్డి మాటలు, కథలు చెప్పొద్దని, ఆయన చేసిన మంచి చెప్పుకుంటే వడిసిపోదని అన్నారు. ఈ పదిహేను నెలల కాలంలో ప్రజలందరూ వాట్సాప్‌లు, యూట్యూబ్‌లు చూస్తున్నారని, ఏ ఒక్క ఆడబిడ్డను పలుకరించినా, రేవంత్‌ను ఏకిపారేస్తున్నారని, తెలుగు భాషలో ఇన్ని తిట్లు ఉంటాయని ఇప్పుడిప్పుడే తెలుస్తుందని అన్నారు. "ఏం తిట్లు అవి.. రోషం ఉన్నోడు అయితే పాడుబడ్డ బావిలో దూకి చస్తుండే. కానీ రేవంత్ రెడ్డి కాబట్టి బ్రహ్మాండంగా బతికేస్తుండు. ఇంకా మంచి చేసిన అని డైలాగులు కొడుతుండు," అని కేటీఆర్ మండిపడ్డారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇండ్ల పద్మను పరామర్శించిన పల్లె రవికుమార్



**మునుగోడు, మార్చ్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మునుగోడు మండల ఇంచార్జ్ ఏపివో ఇండ్ల నాగరాజు (సింగారం) భార్య ఇండ్ల పద్మ, 6 రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు ప్యాక్చర్ అయి తీవ్రంగా గాయపడింది. ప్రస్తుతం ఆమె ఎల్బీనగర్ రాక్ టౌన్ కాలనీలోని పవన్ సాయి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ శనివారం రాత్రి హాస్పిటల్‌కు వెళ్లి పద్మను పరామర్శించి ధైర్యం చెప్పారు. హాస్పిటల్ ఎండి డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్‌తో ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అఖిల భారత గౌడ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల వేములయ్యగౌడ్, జర్నలిస్ట్ పోగుల ప్రకాష్ తదితరులు కూడా పాల్గొన్నారు.

# నేడే వనపర్తికి సీఎం రాక





-నలభై ఏళ్లకు సీఎం హెూదాలో వనపర్తికి రానున్న రేవంత్ రెడ్డి
-ఒకప్పుడు వనపర్తిలోనే ఉన్నత విద్యాభ్యాసం పూర్తి
-నలభై ఏళ్ల కిందట చదువుకున్న మిత్రులు, గురువులను మరవని వ్యక్తిగా గుర్తింపు
-నేడు రూ. 721కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్న సీఎం.రేవంత్ రెడ్డి

వనపర్తి,మార్చ్ 1నీలగిరి ఎక్స్ (ప్రెస్ న్యూస్)

నలభై ఏళ్ల కిందట చదువుకున్న వనపర్తిని మరింత అభివృద్ధి చేసేందుకు సీఎం. రేవంత్ ప్రత్యేక దృష్టి సారించారు.14నెలల్లోనే రూ. 1000 కోట్ల దాక నిధులు మంజూరు చేసి వనపర్తిపై తమ అభిమానాన్ని చాటుకున్నారు.వనపర్తి మున్సిపాలిటీ పుర వీధుల్లో విద్యనభ్యసించిన రేవంత్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి హెూదాలో తొలిసారిగా నేడు వనపర్తికి రానున్నారు.వనపర్తిలో చదువుకున్న విద్యార్థిగా ఈ ప్రాంతంపై ఎనలేని ఆప్యాయత, అభిమానం ఉన్న ఆయన వనపర్తికి సీఎం హెూదాలో వస్తుండడంతో వనపర్తి జిల్లాలో ఆశలు భారీగా చిగురిస్తున్నాయి.1980 నుంచి 85 వరకు ఉన్నత విద్యను వనపర్తి ప్రభుత్వ బాలుర పాఠశాలలో చదువుకునేందుకు బోయ మశన్న నివాసంలో తన సోదరులతో కలిసి చదువుకునేవాడు. ఉన్నత విద్య అనంతరం ఇంటర్మీడియట్ విద్యను కూడా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతూ విద్యార్థి నాయకుడిగా పని చేశారు.ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వనపర్తి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు.అనంతరం వనపర్తి పాలిటెక్నిక్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారు. వనపర్తి జిల్లాకు తొలిసారిగా ముఖ్యమంత్రి హెూదాలో రానున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది.బి

**వనపర్తిలో రేవంత్ రెడ్డికి ఉన్న అనుబంధం**

వనపర్తిలో కొన్నాళ్లపాటే చదువుకున్నా ఇక్కడి అనుబంధాన్ని పిసిసి అధ్యక్షుడి హెూదాలో ఎన్నికల సమయంలో వనపర్తికి వచ్చిన ప్రతిసారి సీఎం రేవంత్ రెడ్డి నెమరు వేసుకునే క్రమంలోనే ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. అలాంటిది ముఖ్యమంత్రి హెూదాలో తన మిత్రులతో కలిసి సంభాషించేందుకు అలనాటి మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకునేందుకు సీఎం హెూదాలో స్నేహభావం విలువను చాటి చెప్పేందుకు తన మిత్రులతో రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సుమారు గంట నుంచి రెండు గంటల పాటు సమావేశం కానుండడం అధికారిక షెడ్యూల్ లో వెల్లడి కావడంతో రేవంత్ రెడ్డి చిన్ననాటి మిత్రులు తబ్బిబ్బి పోతున్నారు. అప్పట్లో చదువు చెప్పిన ఉపాధ్యాయుడు అయ్యలూరి రఘునాథ శర్మ ప్రస్తుతం పదవి విరమణ పొంది వనపర్తి వెంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తగా



వ్యవహరిస్తున్నారు. ఆయన బోధనాస్ఫూర్తిని నెమరు వేసుకుంటూ ఆలయ నిర్వహణకు, అభివృద్ధికి చదువు చెప్పిన ఉపాధ్యాయుడిని మెప్పించేందుకు రూ. 1కోటి రూపాయలు ప్రభుత్వ నిధుల నుంచి ఇవ్వనున్నారు.తాను చదువుకున్న వనపర్తి బాలుర స్కూల్, కళాశాల అభ్యున్నతికి రూ. 60కోట్లు, రూ.257 కోట్లతో 500 పడకల ఆసుపత్రి, రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్, రూ. 22కోట్లతో ఐటి టవర్, రూ.81 కోట్లతో కోర్టు కాంప్లెక్స్, రూ.40 కోట్లతో వనపర్తి -పెద్దమందడి రహదారి,మరో రూ.40 కోట్లతో గ్రామీణ రోడ్ల అభివృద్ధి వారి కోట్లతో ఎస్టి ఆవాస ప్రాంతాల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు 10329 మందికి రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలోని ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లను ఉచితంగా ఇచ్చేందుకు ఇక్కడే ప్రారంభించనున్నారు..మొత్తం రూ.721కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులకు సీఎం.రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేయనున్నారు.నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి అధ్యక్షతన రుణమేల, జాబ్ మేళా కింద 37 కంపెనీలతో వెయ్యి మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నేడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించి.. నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన అనంతరం పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించే భారీ బహిరంగ సభకు 50 నుంచి 60 వేల మందిని తరలించేందుకు ఎమ్మెల్యే మేఘారెడ్డి కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.బి

**భారీగా వెలసిన ఫ్లెక్సీలు, కటౌట్లు**

బివనపర్తిలో చదువుకున్న విద్యార్థిగా సీఎం రేవంత్ రెడ్డి వనపర్తికి వస్తుండడంతో సీఎం ముఖచిత్రాల ఫ్లెక్సీలతో వనపర్తి నిండిపోయింది. ఏ ప్రాంతం చూసిన రేవంత్ రెడ్డి ముఖచిత్రాలతో సీఎం ఫోటోలతో నిండిపోవడంతో నేడు జరగనున్న సీఎం సభ పై భారీగా అంచనాలు పెరిగాయి. ఇప్పటివరకు వెల్లడించిన అభివృద్ధి కార్యక్రమాలే కాకుండా మరికొన్నింటిని సీఎం రేవంత్ రెడ్డి స్వతహాగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయని ఆయన చిన్ననాటి స్నేహితులు సైతం పలు అభివృద్ధి పనులపై ప్రతిపాదనలకు ఆమోదం కోరే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. దీనికి తోడు ప్రస్తుతం కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్, కమ్యూనిస్ట్ పార్టీలలో ఉన్న చాలా మంది ద్వితీయ శ్రేణి నాయకులు సైతం రేవంత్ రెడ్డికి నేరుగా పేరుతో పిలిచి మాట్లాడే సాన్నిహిత్యం ఉండే మిత్రులు నేటికీ ఉన్నారు. రాజకీయంగా సిద్ధాంతాలు విభిన్నంగా ఉన్నప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి రాకపై రాజకీయ వర్గాల మిత్రులలోనూ ఆసక్తి, ఉత్కంఠ, ఆశలు రేపుతున్నాయి.

**- సీఎం రాక సందర్భంగా భారీ బందోబస్తు**

ముఖ్యమంత్రి వనపర్తి పర్యటన సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. 830 మంది పోలీసులు పటిష్ట బందోబస్తులో పాల్గొననున్నారు. బందోబస్తుకు సంబంధించి 3ఎస్పీలు, 3అడిషనల్ ఎస్పీలు,12మంది డీఎస్పీలు,25మంది సిఐలు, 68మంది ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులను బాధ్యులుగా నియమించారు.బందోబస్తులో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల పార్కింగ్ కోసం పాల కేంద్ర%శీ%, భగీరథ చౌరస్తా, పానగల్ రోడ్డు, డిపో రోడ్డు వద్ద ఖాళీ స్థలం వద్దు ఏర్పాట్లు చేశారు.ఎంపీ. మల్లు రవి,ఎమ్మెల్యేమేఘా రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి , ఎస్పీ. గిరిధర్ రావుతో పాటు కాంగ్రెస్ ముఖ్య నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి ఉదయం హెలికాప్టర్‌లో వనపర్తికి చేరుకోని ముందుగా శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.అనంతరం మంజూరైన రూ. 721కోట్లకు సంబంధించిన పనులకు శంకుస్థాపనలు చేస్తారు.

**ముఖ్యమంత్రి పర్యటన ఇలా...**

ఉదయం: గం? 11:30 ని?లకు వనపర్తికి సీఎం రాక
ఉదయం: గం? 11:40 ని?లకు శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం సందర్శన మరియు దేవాలయ అభివృద్ధి పనులకు శిలాఫలకము ఆవిష్కరణ
మధ్యాహ్నం: గం? 12:00 ని?లకు ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు) మైదానం నందు-వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన
మధ్యాహ్నం: గం॥ 02:35 ని?లకు కె.డి.ఆర్. పాలిటెక్నిక్ కళాశాల మైదానము నందు లబ్ధిదారులకు వివిధ పథకముల పంపిణీ
ఇందిరమ్మ మహిళా శక్తి రేవంతన్న కా భరోసా" పథకము ప్రారంభోత్సవము-రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ ద్వారా మైనారిటీ మహిళా లబ్దిదారులకు కుట్టుమిషన్ల పంపిణీబి
లోన్ మేళా ద్వారా లబ్దిదారులకు చెక్కుల పంపిణీ
జాబ్ మేళా ద్వారా నియామక పత్రముల అందజేత
స్టాల్స్ సందర్శన
మధ్యాహ్నం: గం॥ 03:00 ని?లకు ప్రజా పాలన ప్రగతి బాట బహిరంగ సభ
సాయంత్రం: గం॥ 04:35 నిలకు కార్యక్రమ ముగింపు

# చెట్టు = అమ్మ
# చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**
-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.
-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.
-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**
-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.
-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.
చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"
మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త


# విద్యా కమిషన్ సభ్యులు చారకొండ వెంకటేష్ ను కలిసిన మట్ట భరత్



వెల్దండ, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

వెల్దండ మండల కేంద్రంలో రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తక్కెళ్ళపల్లి శేఖర్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు ముదిగొండ రమేష్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మట్ట భరత్ గౌడ్, సమీర్ మరియు రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు చారకొండ వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. సొంత గ్రామానికి వెళ్తున్న సందర్భంగా కొద్దిసేపు వెల్దండ గేటు దగ్గర కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు మట్ట భరత్ తో మరియు కాంగ్రెస్ నాయకులతో కొద్దిసేపు పార్టీ కార్యకలాపాలపై చర్చించారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు అవలంబించవలసిన అంశాలపై సమీక్షించడం జరిగింది. ప్రతి ఒక్కరు కాంగ్రెస్ కార్యకర్త వీర విధేయుడై కాంగ్రెస్ పార్టీకి పని చేయాలని కోరారు.

# ఢిల్లీలో 15 ఏళ్లు దాటిన వాహనాలకు ఇంధనం బంద్



**న్యూఢిల్లీ, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఢిల్లీ ప్రభుత్వం శనివారం కీలక నిర్ణయం తీసుకుంది. 15 ఏళ్లు పైబడిన వాహనాలకు మార్చి 31 తర్వాత బంకుల్లో ఇంధనం పోయకూడదంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం కాలుష్య కట్టడికి తీసుకున్న చర్యల్లో భాగమని పర్యావరణ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా తెలిపారు. పెట్రోల్ బంకుల వద్ద టెక్నికల్ గాడ్జెట్‌లు ఏర్పాటు చేసి, 15 ఏళ్లు పైబడిన వాహనాలను గుర్తించి వాటికి ఇంధనం అందించకుండా చేస్తామని వెల్లడించారు. అలాగే, ఈ ఏడాది చివరినాటికి పబ్లిక్ సీఎన్‌జీ బస్సుల్లో 90 శాతం బస్సులను దశలవారీగా తొలగించి, వాటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడతామని తెలిపారు. ఈ చర్యలు ఢిల్లీలో వాయు కాలుష్యాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఓటమిపాలై, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) విజయ సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఢిల్లీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ప్రజలలో చర్చనీయాంశంగా మారింది

# కాశింనగర్ ఎత్తిపోతల పథకం మంజూరు

-6 గ్రామాలు, 13 గిరిజన తాండాలలో 4 వేల ఎకరాలకు సాగు నీరు
-సీఎం రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి లకు ధన్యవాదాలు
-రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

**వనపర్తి,మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గంలోని ఆరు గ్రామాలు, 13 గిరిజన తాండాల్లోని దాదాపు నాలుగు వేల ఎకరాలకు సాగు నీరు అందించే కాశీంనగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఈ మేరకు శనివారం ప్రభుత్వం మెమో నంబర్ 1712/ ప్రాజెక్ట్స్ - II/ A%2/ 2025, తేదీ 1-3-2025 ద్వారా జారీ చేసిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ శ్రీ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా జీవో కాఫీ నీ పత్రికలకు విడుదల చేశారు



ఆదివారం సర్వే పనులకు ముఖ్యమంత్రి శ్రీ ఏ రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని చిన్నారెడ్డి తెలిపారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ క్రింద కాశిం నగర్, జయన్న తిరుమలాపురం, మున్ననూరు, అప్పాయిపల్లి, దత్తయిపల్లి, అంజనగిరి గ్రామాలతోపాటు మరో 13 గిరిజన తాండాలకు నాలుగు వేల ఎకరాలకు సాగు నీరు అందించే లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు ఇచ్చిందని చిన్నారెడ్డి పేర్కొన్నారు.
కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ సహా ఇతర ప్రతిపాదిత నీటి వనరులకు ఈ ప్రాంతం ఎత్తుగా ఉండటం వల్ల కాశిం నగర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంజూరు చేశారని చిన్నారెడ్డి తెలిపారు. ఎన్నో ఏళ్లుగా చివరి ఆయకట్టుకు సాగు నీరు రాక ఇబ్బందులు పడుతున్న రైతులకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం శుభవార్త చెప్పిందని చిన్నారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.
కాశిం నగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఇరిగేషన్ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డిలకు చిన్నారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.
ఆదివారం వనపర్తిలో జరుగనున్న ముఖ్యమంత్రి బహిరంగ సభకు రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని చిన్నారెడ్డి కోరారు.

# ఇబ్రహీంపట్నంలో టాస్క్ మెగా జాబ్ మేళాలో పాల్గొన్న సుంకిరెడ్డి




**ఇబ్రహీంపట్నం, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఇబ్రహీంపట్నం పట్టణ కేంద్రంలో ఎంఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో, తెలంగాణ అకాడమీ ఫర్ సిల్క్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) చే నిర్వహించబడిన మెగా జాబ్ మేళా యువతకు ఉద్యోగ అవకాశాలు అందించే గొప్ప వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా టాస్క మెగా జాబ్ మేళాకు హాజరైన టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ, నేటి యువతకు సరైన మార్గదర్శకత్వం, నైపుణ్య అభివృద్ధి, మరియు ఉద్యోగ అవకాశాలు కల్పన ద్వారా భవిష్యత్తును నిర్మించగలగటం టాస్క లక్ష్యమని తెలిపారు. టాస్క యువతకు నైపుణ్యాలు అందిస్తూ, వారిని ఉపాధి అవకాశాలలో అనుసంధానించేందుకు కృషి చేస్తుందని అన్నారు. ఈ మేళాలో 30 కంపెనీలు పాల్గొనగా, 4300 మంది హాజరయ్యారు. 1760 అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమం యువతకు నూతన ఆత్మవిశ్వాసాన్ని కల్పించిందని, ఈ జాబ్ మేళాను విజయవంతం చేసిన టాస్క ప్రతినిధులకు, కంపెనీలకు, మరియు పాల్గొన్న అభ్యర్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. యువతకు మరిన్ని అవకాశాలు అందించేందుకు టాస్క నిరంతరం కృషి చేస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు.

# పలు అభివృద్ధి కార్యక్రమాలల్లో పాల్గొన్న వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి





**వంగూరు, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

వంగూరు మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో బతుక శంకర్ గారి ఆధ్వర్యంలో సిసి రోడ్డు నిర్మాణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ రాష్ట్ర కమిషన్ సభ్యులు కేవీయన్ రెడ్డి, కల్వకుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దేశినేని పండితు రావు, విష్ణువర్ధన్ రెడ్డి, జనార్దన్ ఎంపిటిసి, చిన్నయ్య మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అనంతరం, జాజాల గ్రామ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఫిల్టర్ ట్యాంకును విద్యార్థుల కోసం మాజీ విఆర్ఓ గోపాల్ రెడ్డి జ్ఞాపకార్థంగా, వారి కుమారులైన మామిడి డాల కొండల్ రెడ్డి విరాళంగా అందించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కె.వి.ఎన్.రెడ్డి, కల్వకుర్తి వ్యవసా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దేశినేని పండితు రావు, వంగూరు మండల ఎంఈఓ మురళి మోహన్ చారి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పర్వత్ రెడ్డి లక్ష్మారెడ్డి, ప్రధానోపాధ్యాయులు విజయభాస్కర్, గ్రామపంచాయతీ సెక్రటరీ భీమ్ తేజ్ గౌడ్, మాజీ సర్పంచ్ భాస్కర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు కృష్ణ, బాలిశ్వర్, రుకియా బేగం, జానీ పాషా, హసీనా బేగం తదితరులు హాజరయ్యారు.

# పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీయన్ రెడ్డి



**కల్వకుర్తి, మార్చి 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కల్వకుర్తి పట్టణ కేంద్రంలోని పద్మశాలి భవన్‌లో శుక్రవారం, కొండారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం హేమలత పదవి విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీయన్ రెడ్డి హాజరై, హేమలత చేసిన సేవలను ప్రశంసించారు. "హేమలత గారు 8 సంవత్సరాలుగా పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారు," అని కెవిఎన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగార సంఘం రాష్ట్ర అధ్యక్షులు శేఖర్, జిల్లా అధ్యక్షులు గట్టు శ్రీనివాస్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, భోజ రెడ్డి, రైతు నాయకులు, వంగూర్ ఎంఈఓ మురళి మోహన్ ఆచారి, టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు చిన్నయ్య, పిఆర్టియు జిల్లా కార్యదర్శి సురేందర్ రెడ్డి, యుటిఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షులు ఏపీ మల్లయ్య, రంగాపూర్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీమతి సుధారాణి, జడ్పిహెచ్‌ఎస్ మాచర్ల హెచ్‌ఎం చిరంజీవి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# వేసవి.. శరీరానికి శీతోష్ణసమతుల్యత కల్పిద్దాం!



వేసవి రాగానే భయపడిపోయేవారికి ఇది మంచిరోజులే కాదు, ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాల్సిన సమయమూ. సూర్యుడి కిరణాలు మండిపోతున్న వేళ, శరీరాన్ని తగిన విధంగా సంరక్షించుకుంటే ఆరోగ్యాన్ని చెక్కుచెదరకుండా కాపాడుకోవచ్చు. వేసవి మంటలు, ఎండదెబ్బ, డీహైడ్రేషన్ లాంటి సమస్యల నుంచి ఎలా దూరంగా ఉండాలో తెలుసుకుందాం.

**శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలి**

వేసవిలో నీటి శాతం తగ్గిపోతే శరీరంపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. కాబట్టి, ద్రవాలు తగినంతగా తీసుకోవడం తప్పనిసరి.

-రోజుకు కనీసం 3-4 లీటర్ల నీరు తాగాలి.

-మజ్జిగ, కొబ్బరినీరు, తాజా పండ్ల రసాలు తాగితే శరీరం చల్లబడుతుంది.

-కోల్డ్ డ్రింక్స్, ఆల్కహాల్, అధిక క్యాఫైన్ తగ్గించుకోవాలి.

**-ఎండతాపం నుంచి చర్మ సంరక్షణ**

ఎండలో తిరగడం వల్ల చర్మంపై ప్రభావం పడుతుంది. సరైన రక్షణ లేకపోతే సన్‌బర్న్, అలర్జీ సమస్యలు రావచ్చు.

- %ూఖీ% 30ం సన్‌స్క్రీన్ తప్పనిసరిగా అప్లై చేయాలి.- లూస్, కాటన్ బట్టలు ధరించాలి.

- సన్‌గ్లాసెస్, టోపీ లేదా స్కార్ఫ్ వాడాలి.

**వేసవిలో తినదగిన ఆహారం**

ఎండ వేడి నుంచి రక్షణ పొందేందుకు శరీరాన్ని లోపల నుంచి చల్లగా ఉంచే ఆహారాన్ని తీసుకోవాలి.

- నీరు అధికంగా ఉండే పండ్లు %-% పుచ్చకాయ, ఖర్బూజ, ద్రాక్ష, నారింజ, పైనాపిల్.

- శరీరాన్ని చల్లబరిచే కూరగాయలు %-% టమాట, కీరా, సొరకాయ, బీరకాయ, దొండకాయ.

- తేలికైన, శరీరానికి హాని చేయని ఆహారం %-% మజ్జిగ, పెరుగు, కొబ్బరినీరు, గోధుమ రవ్వ ఉప్మా, పెసరపప్పు సూప్స్.

- ప్రోటీన్ సమృద్ధిగా ఉండే తేలికైన ఆహారం %-% పప్పులు, గుడ్లు, చేపలు, మిలెట్స్ (రాగులు, జొన్నలు, గోధుమలు).


డాక్టర్ వాస సింధూజ

-ఎండదెబ్బ (సన్ స్ట్రోక్) నివారణ ఎలా?లి

ఎండ తీవ్రత అధికంగా ఉన్న వేళ శరీర ఉష్ణోగ్రత 104□%F (40□C%) పైకి వెళ్లి, తీవ్ర ఆరోగ్య సమస్యలు కలిగించే ప్రమాదం ఉంది.

**ఎండదెబ్బ లక్షణాలు:**

- తీవ్రమైన తలనొప్పి, అధిక జ్వరం

-శరీరంలో నీరసం, గుండె వేగంగా కొట్టుకోవడం

- వికారం, వాంతులు, విరేచనాలు

- చర్మం ఎర్రగా మారడం, మూర్ఛ

**ఎండదెబ్బ వస్తే ఏం చేయాలి?**

-బాధితుడిని చల్లని ప్రదేశానికి తీసుకెళ్లాలి.

- తడి గుడ్డతో శరీరాన్ని తడిపి, శరీర ఉష్ణోగ్రత తగ్గించాలి.

- ORS ద్రావణం, నిమ్మరసం, మజ్జిగ తాగించాలని సూచించాలి.

-తీవ్రమైతే డాక్టర్‌ను వెంటనే సంప్రదించాలి.

**వేసవిలో దూరంగా ఉండాల్సినవి**

- అధిక మసాలా, డీప్ ఫ్రై చేసిన ఆహారం

- సోడా, కోల్డ్ డ్రింక్స్, అధిక క్యాఫిన్ కలిగిన కాఫీ, టీ

- అధిక ఉప్పు, చక్కెర కలిగిన పదార్థాలు

- ఫాస్ట్ ఫుడ్, ప్రిజర్వేటివ్ ఉన్న పానీయాలు

వేసవిని ఆరోగ్యంగా ఆస్వాదించాలి!

ఈ కాలంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. రోజుకు కనీసం 3-4 లీటర్ల నీరు తాగడం, సరైన ఆహారం తీసుకోవడం, ఎండలో ఎక్కువ సేపు ఉండకపోవడం ద్వారా ఈ సీజన్‌ను ఉల్లాసంగా గడిపేయొచ్చు. వేసవి అంటే భయం కాదు%ౌ% జాగ్రత్తగా ఉంటే ఆరోగ్యంగా ఉండే కాలం!


వ్యాసకర్త
డాక్టర్ వాస సింధూజ

# గిరిజన తండాల అభివృద్ధికి 28.67 కోట్ల నిధులు మంజూరు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

**- జీవో ఆర్.టీ 71 ప్రకారం 6కోట్లు**
**- జీవో ఆర్.టీ 37 ప్రకారం 12.60 కోట్లు**
**- జీవో ఆర్.టీ 38 ప్రకారం 10.07 కోట్లు**
**మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**
**- నిధుల మంజూరుకి ప్రత్యేక కృషి చేసిన శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి**

**వనపర్తి,మార్చ్ 01(నీలగిరి ఎక్స్ ప్రెస్**

నిధుల మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి కి, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ సీతక్కకి, ఇంచార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ కి, జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావుకి, నాగర్కర్నూల్ పార్లమెంట్ సభ్యులు శ్రీ డాక్టర్ మల్లురవికి కృతజ్ఞతలు తెలియజేసిన ఎమ్మెల్యేలిబి వనపర్తి నియోజకవర్గంలోని గిరిజన తండాల అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని


Annexure-38 to G.O.Rt.No.71, PR&RD (Roads) Department, Dated:27.01.2025
Details of works of Wanaparthy Constituency
GOVERNMENT OF TELANGANA ABSTRACT
GOVERNMENT OF TELANGANA ABSTRACT

ఈ క్రమంలో గిరిజన తండాలకు రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు 28.67 కోట్ల నిధులు మంజూరు చేస్తూ జీవోలు జారీ చేసిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు దీంతో ఏళ్ల తరబడి సరైన రవాణా సౌకర్యాలకు నోచుకుని గిరిజన తండాలన్నింటికీ రోడ్డు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరుచుకోవచ్చునని ఎమ్మెల్యే పేర్కొన్నారు

గతంలో ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పాటు చేసిన రోడ్లే ఇప్పటికి గిరిజన తండాలో ఉన్నాయని.

నేడు మళ్ళీ ఇందిరమ్మ రాజ్యంలోనే గిరిజన తండాల రోడ్ల కు మహార్దశ వచ్చిందన్నారు

తండాలలోని గిరిజన సామూహిక భవనాల పటిష్టత, పాఠశాలల పటిష్టత, పంచాయతీ భవనాల ప్రహరీ గోడలు కొన్ని లాంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టుకోవచ్చునని ఎమ్మెల్యే తెలిపారు ఈ నిధుల మంజూరికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు

# ఘనంగా హేమలత సగర పదవి విరమణ మహోత్సవం

**కల్వకుర్తి, మార్చ్ 1 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

నాగర్ కర్నూల్ జిల్లా సగర మహిళా సంఘం కోశాధికారి హేమలత సగర, కొండారెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన సందర్భంగా, రాష్ట్ర సగర సంఘం అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర హాజరై హేమలత సగర మరియు వివేకానంద సగర దంపతులను అభినందిస్తూ సన్మానం చేశారు. కల్వకుర్తి పట్టణంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగిన పదవి విరమణ మహోత్సవానికి ప్రత్యేక అతిథిగా రాష్ట్ర సగర సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా, రాష్ట్ర సగర సంఘం అధ్యక్షులు శేఖర్ సగర మాట్లాడుతూ, హేమలత సగరను పవిత్ర ఉపాధ్యాయ వృత్తిలో అనేకమంది భావి భారత పౌరులను తీర్చిదిద్దిన ఘనతవల్ల అభినందిస్తూ, సమాజ హితం కోసం శేష జీవితాన్ని సేవలందించవలసిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్రికల్చర్ ఫార్మర్స్ వెల్ఫేర్ కమిషన్ సభ్యులు కెవిఎన్ రెడ్డి, వంగూర్ మండల విద్యాధికారి మురళీ మనోహర్, నాగర్ కర్నూల్ జిల్లా సగర సంఘం అధ్యక్షులు పోతులపల్లి గట్టు శ్రీనివాస్ సగర, రాష్ట్ర సగర మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి అతినారపు విజయలక్ష్మి సగర, రాష్ట్ర ఉపాధ్యక్షులు గొల్లూరి రాములు సగర, రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి బంగారి ఆంజనేయులు సగర, జిల్లా కోశాధికారి పడకంటి రాజు సగర, జిల్లా గౌరవ సలహాదారులు భీమయ్య సగర, జిల్లా ఉపాధ్యక్షులు కొమ్ముల శ్రీనివాస్ సగర, కల్వకుర్తి పట్టణ సగర సంఘం అధ్యక్షులు రొట్టె రాజు, ప్రధాన కార్యదర్శి జంగయ్య, కోశాధికారి వావిలాల యాదగిరి, యువజన సంఘం కార్యదర్శి శేగూరీ నరేష్ మరియు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

